


# పరిహారం

ప్రతాపరవిశంకర్

రమణమూర్తి ఆఫీసుకు వెళ్ళడానికి ఇంట్లోనుండి బయటకువచ్చాడు. ఆయనతో గుమ్మంవరకూ వచ్చిన భార్య దుర్గాంబ "గట్టి ప్రయత్నం చేయండి. ...మొహమాట పడకండి. వాడు దిగాలుగా వున్నాడు" అన్నది చిన్నగానే.

విసుక్కున్నాడాయన.

"నాకు తెలీదూ? నేను వాడి తండ్రిని దుర్గా... నా బాధ్యత గురించి నువ్వు నాకు గుర్తుచేయాలా?" అన్నాడు ముందుకు నడుస్తూ.

ఆ మాటలతో నొచ్చుకుని లోపలకు వెళ్ళిపోయింది దుర్గాంబ.

రోడ్డుమీదకు రాగానే అక్కడే తండ్రి కోసం నిల్చున్న రాంబాబు కనిపించాడు. రమణమూర్తిని చూడగానే ఆయన పక్కకు వచ్చి "నన్ను మధ్యాహ్నం ఆఫీసుకు రమ్మంటావా?" అన్నాడు.

"నువ్వెందుకు? రేపటివరకూ టైముంది కదూ...దొరికితే సాయంత్రం నేనే తీసుకువస్తాను" అన్నాడాయన కొంచెం కోపంగా—

రాంబాబు మొహాన్ని చిన్నబుచ్చుకుని దిగులునిండిన మొహంతో రోడ్డుమీదనే నిలబడిపోయాడు వెళుతున్న తండ్రిని చూస్తూ.

కొడుకు తనని తన చేతకానితనాన్ని మనసులోనే తిట్టుకుంటూ వుంటాడని రమణమూర్తి అనుకున్నాడు.

నిజమే. అందులో తప్పు లేదు. ఇప్పుడు తన సమస్య యాభై ఐదు. తను ఉద్యోగంలో ప్రవేశించి ముప్ఫయేళ్ళు దాటుతోంది. ఐనా ఈ రోజువరకూ మడికట్టుకు కూర్చుని కొడుకు పరీక్షఫీజు కట్టడానికి దిక్కుతోచక తిరుగుతున్నాడంటే తన చేతగానితనంగా అగుపించదూ?

ఆయన రోడ్డుమీద యాంత్రికంగా నడుస్తున్నాడు. ఆయన ఆలోచనలన్నీ డబ్బును పుట్టించడం గురించే. కాస్తో

కూస్తో నిజాయితీగా పై సంపాదనలకు ఆశపడకుండా అలవాటు పడకుండా ఉద్యోగాలు చేసుకుంటూ సంసారాలను నెట్టుకురావాలని ప్రయత్నించే మధ్యతరగతి మనుషులకు ఇటువంటి పరిస్థితులు తప్పవేమో అనుకున్నాడు.

అపరాధ రుసుముతోకూడా కొడుకు రాంబాబు బియ్యే ఆఖరి సంవత్సరానికి ఫీజు కట్టడాన్కి ఒకే ఒక్క రోజు వ్యవధి వుంది. నెలాఖరు. పది రూపాయలే దొరకడం కష్టంగా వున్న టైములో వందకు పైగా రూపాయలను ఎవరిస్తారు?


ఋణదాత గురించే ఆలోచిస్తూ ఆఫీసుకు చేరుకున్నాడు రమణమూర్తి. ఆయన ఆ ఆఫీసుకు హెడ్ క్లర్కు. ఆయన పదవీ విరమణ కూడా హెడ్ క్లర్కుగానే జరుగుతుందని ఆయన ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. ఆ ఆఫీసులో ఆయనంటే ఎంతో గౌరవం వుంది ఒక్క ఆఫీసర్‌కు తప్పించి.

ఆఫీసర్ బాగా లంచాలు మెయ్యటానికి, దొంగ తిండి తినటానికి అలవాటుపడిన మనిషి. అయితే ఆయన తరుపున పార్టీలతో మాట్లాడి డబ్బు సంపాదించగలమనిషి ఆయనకు కావాలి. సాధారణంగా హెడ్ క్లర్కు తెలివి తేటలు వాకచక్యం వున్నవాడయితే ఇటువంటి విషయాల్లో ఆఫీసర్‌కు ఇబ్బంది వుండదు కాని రమణమూర్తి ఈ లంచాల విధానానికి పూర్తిగా వ్యతిరేకి. అందువల్ల ఆఫీసర్ ఆఫీసులో సూపర్నెంటునే చేరదీసి ఈ పనులకు నియమించాడు. ఆ సూపర్నెంటు ఆఫీసర్ గారిని మించిన మనిషి. ఇసుకలో తైలాన్ని పిండే రకం. పార్టీలదగ్గర దండిగానే వసూలుచేసి ఆఫీసర్‌కు తక్కువ ముట్టచెబుతున్నాడు. ఈ విషయం ఆయనకు తెలుసు. హెడ్ క్లర్కు రమణమూర్తి మడికట్టుకుని నిజాయితీ గిరి గీసుకుని కూర్చోవడం వల్లనే తను నష్టపోతున్నాడని ఆఫీసర్‌కు ఆయనంటే కోపం.

మిగిలిన ఉద్యోగులందరికీ రమణమూర్తి మీద అభిమానం వున్నా ఒక విధమైన భయం చిన్నచూపు కూడా వున్నాయి. అందుక్కారణం ఆయన ఆర్థిక పరిస్థితే. కుటుంబ ఖర్చులకు జీతం డబ్బు చాలక దాదాపు ప్రతినెలా ఆఫీసులో ఎవరో ఒకరి దగ్గర అప్పుగా డబ్బులు తీసుకోవడంతో ఆయన కొంత చులకన అయిపోయాడు. ఈ విషయం కూడా ఆయనకు తెలుసు. అయినా తప్పటంలేదు.

అప్పటికే ఆఫీసులో అంతా వచ్చారు కానీ టైపిస్టు మనోరమ రాలేదు. ఆమె కూర్చునే సీటు ఒక్కటే ఖాళీగా వుంది.

చిన్నగా వెళ్ళి తన సీట్లో కూర్చుని వెనక్కు వాలాడు రమణమూర్తి. ఆయన కళ్ళముందు ఒక్కసారిగా



రాంబాబు, వాడి దీనమైన మొహం గిర్రున కదిలాయి. కళ్ళు మూసుకుని తల నొక్కుకున్నాడు భారంగా—

క్రితం రోజునే ఆఫీసులో దాదాపు అందర్నీ డబ్బు గురించి యాచించాడు. ఎవ్వరూ ఇవ్వలేదు. కొంతమంది నిజంగానే డబ్బు లేక లేవన్నారు. ఇంకొంత మంది వుండి కూడా ఆయన వెంటనే తిరిగి ఇవ్వలేడని లేవని చెప్పారు. దాదాపు ఆ ఆఫీసులో చాలా మందికి రమణమూర్తి ఎంతో కొంత బాకీపడి వున్నాడు.

ఎంతగా ఆలోచించినా తనకు అవసరానికి సహాయపడగల మనిషి ఎవ్వరూ అయన మనోనేత్రం ముందు కనపడలేదు. ఆఫీసులో ఇక ఎవ్వరినీ అడిగి వుపయోగం లేదని ఆయనకు తెలుసు.

ఆలోచిస్తూనే అర్జెంటు అని వ్రాసి వున్న ఫైలును తెరిచాడు రమణమూర్తి. అందులో వున్న అర్జెన్సీ ఏమిటో ఆయనకు అర్థంకాలేదు. ఆయనకు ఎటు చూస్తున్నా అర్థమవుతున్నది ఒక్కటే. రాంబాబు పరీక్షకు ఫీజు-డబ్బు కావాలి-ఇదే.

ఇంకా టైపిస్టు మనోరమ రాలేదు. కొంచెం దూరంలోనే రమణమూర్తి సీటుకు ఎదురుగానే వుంటుంది ఆమె కూర్చునే కుర్చీ టేబిలు-దానిమీద గాడ్రెజ్ టైపు మిషన్.

ఆఫీసర్ కూడా రాలేదు. కేంప్‌లో వున్నాడు. రెండు రోజులదాకా తిరిగి రాడు.

రమణమూర్తి తిరిగి అర్జెంటు ఫైలును మూసేశాడు. మళ్ళీ కుర్చీలో వెనక్కు వాలాడు. మిగిలిన ఈ ఉద్యోగులందరూ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయి వున్నారు. బయట గోడ పక్కనే వున్న వేపచెట్టుమీద రెక్కలు

పూర్తిగా రాని కాకి పిల్ల ఆగి ఆగి అరుస్తోంది. పెద్దకాకి, పిల్ల నోరు తెరచి నప్పుడల్లా నోట్లో ఏదో ఆహారం పెడు తోంది.

కుర్చీలో వెనక్కి వాలి కిటికీలోనించి ఆ దృశ్యాన్ని చూస్తున్నాడాయన. పిల్ల కాకి పట్ల తల్లికి వున్న ప్రేమ, అను రాగం చూస్తుంటే ఆయనకు మళ్ళీ రాంబాబు గుర్తుకువచ్చాడు.

ఇప్పటి వరకూ తను వాడి పట్ల ప్రేమను ఆప్యాయతను చూపుతునే పెంచాడు. ఇక తన జీవితం పడమటి వైపుకు మళ్ళుతోంది. రాంబాబే తమని ముసలి వయసులో ఏ లోటూ రాకుండా చూసుకోవాలి. అందుకు వాడికి మంచి భవిష్యత్తు వుండాలి. వాడి భవిష్యత్తు కోసం తను ఏమైనా చేయాలి.

రమణమూర్తి ఆలోచనకు అంత రాయం కలిగింది మనోరమ రాకతో—

వస్తూనే "గుడ్ మార్నింగ్ సర్" అంటూ ఆయన్ని విష్ చేస్తూ తన సీట్లో కర్చీఫ్‌తో దుమ్ము దులుపుకుని కూర్చుంది ఆమె.

ట్రిమ్‌గా అలంకరించుకుని వచ్చింది. మిగిలిన మగ ఉద్యోగులు చూపులతోనే ఆమె అలంకరణను అందాన్ని ఆస్వా దించి తమ పనుల్లోకి దిగిపోయారు.

మనోరమకు పెళ్ళయింది. ఆమె భర్త ఏదో ప్రయివేటు కంపెనీలో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. కానీ తనకు పెళ్ళయిందనీ ఇద్దరు పిల్లలు కూడా వున్నారని చెప్పుకోవడం ఆమెకు ఇష్టం వుండదు. ఎవరయినా పిల్లల గురించి మాట్లాడుతూ వుంటే ఆమె మొహాన్ని మాడ్చుకుంటుంది. మనోరమకు ఇంకా తను పెళ్ళికాని అమ్మాయిలానే వుండా లనే తాపత్రయం ఎక్కువగా ఉంది. అందుకు తగ్గట్టుగా రోజుకో రకంగా అలంకరించుకుని ఆఫీసుకు వస్తుంది.

అటెండర్‌ను పిలచింది మనోరమ. వాడు రాగానే పర్సు తెరిచి డబ్బులిచ్చి "వక్కపొడి తీసుకురా" అన్నది.

వాడు డబ్బులు తీసుకుంటూ "మీ పర్సు బాగుందండీ. ఒకసారివ్వండి చూసిస్తాను." అన్నాడు నవ్వుతూ.

"బాబోయ్, ఇందులో నాలుగువందల రూపాయలున్నాయి. నేనివ్వను తర్వాత చూద్దువుగానిలే వెళ్ళు" అన్నది.

మనోరమ నాలుగు వందలు అనే సరికి రమణమూర్తి గుండె కొట్టుకోవడం ఆగిపోయినట్లనిపించింది. నాలుగు వందలా అనుకున్నాడాయన. అయినా మనోరమ అంత డబ్బును ఆఫీసుకు ఎందుకు తీసుకువచ్చింది?

"ఏమిటి విశేషం? నాలుగువందలు ఎందుకు తీసుకువచ్చారు? ఏదైనా వస్తువు కొనాలా?" కార్నర్ సీటులో కూర్చున్న క్లర్కు శివరావు అడిగాడు మనోరమను.



"అవును. మంచి చేతిగడియారం ఖరీదైనది కొనాలి. రేపు మా శ్రీవారి పుట్టినరోజు కానుకగా గడియారం ప్రజెంట్ చెయ్యాలని డబ్బులు తెచ్చాను". అన్నది మెరుస్తున్న కళ్ళతో.

ఇంకోసారి మనోరమను డబ్బులడిగితే ఎలా వుంటుంది అనుకున్నాడు రమణమూర్తి.

ఊహూం. బావుండదు. డబ్బులున్నాయని తెలిసి అడిగాడనుకుంటుంది. అయినా క్రితంరోజునే అడిగాడు. కుదరదన్నది. మొగుడి పుట్టినరోజు కానుక కొంటానికి తెచ్చిన డబ్బును తనకి ఇస్తుందా?

ఇప్పుడు తనేం చేయాలి?

మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాడాయన.

దాదాపు పాతికేళ్ళ క్రితం ఆయన భార్య దుర్గాంబ పెద్దకూతురు జానకి పుట్టినపుడు అన్న మాటలు హఠాత్తుగా ఆయనకు గుర్తుకొచ్చాయి.

అవును. తనకిప్పటికీ గుర్తే. పెళ్ళయిన ఏడెనిమిదేళ్ళవరకూ పిల్లలు పుట్టలేదు. తర్వాత ఆడపిల్ల పుట్టింది.

"మగవాడైతే బాగుండేదండీ. ఆడ శక్తి పుట్టింది" అన్నది దుర్గ అసం

తృప్తిగా.

"ఎవరైతే ఏం దుర్గా ... ఆడపిల్ల అయితే నష్టం ఏమిటి?" అన్నాడు తను.

"మగవాడయితే పెద్దయి మనకు వయసు ముదిరి వంట్లో శక్తి తగ్గేసరికి కుటుంబభారాన్ని మోస్తాడు. ఆడపిల్లే ముంది? నిముషాలమీద చెట్టంతగా ఎదిగి ఉన్నదంతా హరించి పెళ్ళిచేసుకుని ఇంకో ఇంటికి వెళ్ళిపోతుంది" అన్నది.

భార్య మాటల్లో అర్థం ఇప్పటికి బాగా బోధపడింది ఆయనకు. మొదటగా జానకి బదులు రాంబాబు పుట్టినట్టయితే బావుండేది అనుకున్నాడు.

మొదటి సంతానం అని జానకిని బాగానే పెంచాడు. పెళ్ళీడుకు రాగానే ఎప్పుడో తాతలు సంపాదించిన పెంకుటిల్లును అమ్మి కూతురు పెళ్ళిచేసి పంపేశాడు. ఇప్పుడిక ఆస్తిగా చెప్పుకో దగింది ఏదీలేదు పిల్లలు తప్పించి. రాంబాబు తర్వాత ఇంకో ఇద్దరు మగ పిల్లలు ఒక అమ్మాయి వున్నారు.

"ఏమండోయ్ హెడ్ క్లర్కుగారూ! మిమ్మల్నే"

ఉలిక్కిపడ్డాడు రమణమూర్తి. మనోరమ పిలుస్తోంది.

"ఏమిటీ ఏదో ఆలోచనల్లో మునిగిపోయారు వక్కపొడి వేసుకుంటారా?" అనడిగింది చిరునవ్వుతో.

"వద్దు" అన్నాడాయన.

"ఇటు పంపించండి నోరంతా ఏదోలా వుంది" అన్నాడు క్లర్కు శివరావు.

వక్కపొడి పొట్లాన్ని శివరావు మీదకు విసిరి రోలర్‌కు కాయితాలు బిగించి టైపు చెయ్యటం మొదలు పెట్టింది మనోరమ. అప్పటివరకూ ఆ గదిలో నిండివున్న నిశ్శబ్దం క్షణాల్లో మాయమయ్యింది. టకటకమని చప్పుడు మొదలయ్యింది.

కుర్చీలోంచి లేచాడు రమణమూర్తి తలనొప్పిగా వున్నట్లనిపించింది. నెమ్మదిగా నడుస్తూ ఆఫీసులో నించి బయటకు వచ్చాడు. ఆఫీసు ఎదురుగానే హోటలు ఒకటి వుంది. ఆ పక్కనే వున్న మందుల షాపులో తలనొప్పికి టాబ్లెట్ కొనుక్కుని హోటల్లోకి వెళ్ళాడు.

టాబ్లెట్ వేసుకుని కాఫీ తాగాడు.

గుండె నిండుగా ఏదో అశాంతిగా వున్నట్లనిపించింది రమణమూర్తికి.తను నిజాయితీగా వుంటూ ఏవో ఆదర్శాలను చుట్టూ గీసుకుని ఇన్ని కష్టాలను అనుభవించటం ఎందుకు? అనిపించింది. నిజాయితీతో నీతితో తను సాధిస్తున్నది ఏమిటి?

ఎన్నోసార్లు మిగిలిన ఉద్యోగులు- "రమణమూర్తి గారూ ... రోజులు మారాయి...ఆదర్శాలతో మనిషి బతికే రోజులు ఇప్పుడు లేవు. ఏదో విధంగా

బతకటమే ముఖ్యం. పై సంపాదనకు ఆశపడకుండా వచ్చే అవకాశాలను పోగొట్టుకుంటూ డబ్బు కోసం ఇంత ఇబ్బంది పడటం ఎందుకు? అప్పులు చేయడం ఎందుకు? మీ రొక్కరూ నిజాయితీగా నీతిగా వుండడంవల్ల ఈ దేశానికి ఒరిగేదేముంది?" అన్నారు,

వాళ్ళ మాటలు కూడా నిజమేనేమో!

నీతిగా బతకటం మచ్చలేకుండా జీవించడం తన అర్ధాంగి దుర్గకుకూడా ఇష్టమే...కాని తను సంసారశకటాన్ని లాగలేక నిరుత్సాహపడినప్పుడు ఆమె కూడా తన వాదస్తాన్ని హేళనచేస్తూ వుంటుంది.

ఆయన మనసు ఎన్నో రకాల ఆలోచనలను చేస్తోంది.

ఉన్నట్టుండి మనోరమ పర్సు అందులో వున్న నాలుగు వందలు ఆయనకు గుర్తుకువచ్చాయి. హఠాత్తుగా అందులో రెండు వందలు తనకు ఇవ్వగలిగితే ఎంత బావుంటుంది? అనుకున్నాడు.

ఏ పనీ చెయ్యకుండా కూర్చోవటం బావుండదని ఏదో ఫైలు తీసుకుని రాస్తూ కూర్చున్నాడు రమణమూర్తి లంచ్ టైమ్ వరకూ.

ఓంటి గంట దాటింది.

మనోరమ టిఫిన్ బాక్సు తీసుకుని అక్కడ నించి వెళ్ళిపోయింది. ఆఫీసుకు చివరగా స్టోరు గదిలాంటిది వుంది, అందులోనే మనోరమ ఇంకో నలుగురు ఉద్యోగులు కూర్చుని తెచ్చుకున్నదేదో తింటారు లంచ్ టైంలో.

డబ్బు గురించిన ఆలోచనతో ఉదయము సరిగా భోజనం చెయ్యలేదు రమణమూర్తి. అందుకే ఆకలిగా వుంది. హోటల్‌కు వెళ్ళాలని లేచి నిల్చున్నాడు. గదిలోంచి బయటకు వెళ్ళిపోతూ మనోరమ టేబిల్ దగ్గరకు రాగానే ఎందుకో ఆగిపోయాడు. ఓరగా తెరుచుకొనివున్న సొరుగులోంచి ఎర్రటి చిన్న పర్సు కనబడుతోంది. దాన్ని చూడడంతోనే రమణమూర్తి డబ్బు అవసరం దాని ఎమర్జెన్సీ ఎన్నోరెట్లు వికృతంగా మారిపోయి కళ్ళముందు కనపడింది.

తను వాడికి పరీక్షఫీజు కట్టలేదు. తనకు వాడి భవిష్యత్తు ముఖ్యమైనది. రాంబాబు బియ్యే పాసయితే వెంటనే తను పనిచేసే కంపెనీలోనే నెలకు ఐదు వందలు సంపాదించే ఉద్యోగం ఇప్పిస్తానని అల్లుడు విశ్వనాథం ఎన్నోసార్లు చెప్పాడు. ఇప్పుడు వాడికి ఫీజు కట్టకపోతే రాంబాబు బియ్యే పూర్తికాదు. వాడి భవిష్యత్తు ఆదిలోనే కుంటుపడుతుంది. అలా జరగడానికి వీల్లేదు. వాడి భవిష్యత్తుకు ఈ క్షణంలో తను ఏమైనా చెయ్యాలి—తప్పదు,

టేబిల్ సొరుగు లాగాడు రమణమూర్తి వణుకుతున్న చేతులతో. పర్సును అందుకున్నాడు. అందులో వున్న

డబ్బును తీసి జేబులో పెట్టుకోవాలనుకున్నాడు. జిప్ లాగబోతున్నప్పుడు ఎవరో వస్తున్న అలికిడి అయ్యింది. వెంటనే దాన్ని జేబులో వేసుకుని ఆ గదిలోంచి బయటకు వచ్చాడు.

కాళ్ళు చేతులు వణికాయి. నడక కూడా మారిపోయినట్టుగా అనిపించింది. జీవితంలో మొదటిసారిగా దొంగతనం చేశాడు. పరిస్థితులు తనని ఇలా ఇరుకునపెట్టి బంధించి బలవంతంగా ఇటువంటి నికృష్టమైన పని చేయించినందుకు ఏడుపు కూడా వచ్చింది.

హోటల్లోకి వెళ్ళగానే "ఇలారండి" అంటూ పిలాచ్చాడు గుమాస్తా కామేశ్వరరావు. వెళ్ళి అతని ప్రక్కనే కూర్చున్నాడు.

టిఫిన్ తింటూ దేశ రాజకీయాల గురించి మాట్లాడాడు కామేశ్వరరావు. అతడి మాటలు వింటున్నా రమణమూర్తికి ఏమీ అంతుబట్టలేదు. చేతుల వణుకు తగ్గలేదు.

ఇద్దరూ ఆఫీసులోకి వచ్చారు.

మనోరమ హైపుచేస్తోంది.

ఆమెను చూడాలంటె గిల్టీగా అనిపించింది రమణమూర్తికి. ఆమె సొరుగు తెరిచి చూడలేదనీ అందుకే పర్సు పోయినసంగతి ఆమెకు తెలీదనీ అనుకున్నాడు.

సాయంత్రం ఐదుగంటలవరకూ ఏదేదో ఫైలు చూస్తున్నట్టు నటన చేశాడు.

రోలరుకువున్న టైపుచేసిన కాదితాలను తీసి టేబిల్ సొరుగు లాగిన మనోరమ కెవ్వున అరిచినంతపని చేసింది "నా పర్సు పోయింది" అంటూ.

గతుక్కుమన్నాడు రమణమూర్తి.

అంతా ఆమెదగ్గరకు చేరారు,

"సరిగ్గా వెతకండి" అన్నాడు శివరావు.

"వెతికాను,లేదు. నేను సొరుగులోనే పడేశాను. అందులో నాలుగువందలు వున్నాయి ఆయనకు బర్త్‌డే ప్రజెంటేషన్ కొనాలని తెచ్చాను" అంది విచారంగా.

"ఐతే ఈ ఆఫీసులో దొంగలు ఎవరున్నారు? మీకు అనుమానంగా వుంటే మా దగ్గర చూసుకోండి" అన్నాడు కామేశ్వరరావు జేబులు చూపుతూ.

"బయటనుంచి చూశాను. లంచ్ టైంలో ఎవరో కుర్రాడు మన ఆఫీసులోకి వచ్చి మళ్ళీ వెంటనే వెళ్ళిపోయాడు. మీలో ఎవరికోసమో వచ్చి వుంటాడనుకున్నాను" అన్నాడు అటెండర్.

"ఎవరతను?" శివరావు అడిగాడు.

"ఎవరో తెలీదు. సన్నగా పొడవుగా వున్నాడు."

"అనుమానంలేదు. ఐతే ఇది వాడి పనే అయివుంటుంది. వాడే దొంగ.

మనం ఎట్లాగయినా వాడి ఆచూకీ తీయాలి" అన్నాడు కామేశ్వరరావు.

రమణమూర్తికి భయమేసింది. అయినా ధైర్యంగానే వుంది ఆఫీసులో తన నిజాయితీ గురించి, ప్రవర్తన గురించి, అందరికీ తెలుసు. అందువల్ల ఎవరూ తనని అనుమానించే అవుసరం లేదు. మనోరమ పర్సు దొంగతనం చేసినవాడిని తిడుతూ వుంటే తనని తనే తిట్టుకున్నాడాయన ఇలాంటి పని చేసినందుకు. ఆ తిట్లన్నీ వింటుంటే జేబులో వున్న చిన్న పర్సు టన్నుల బరువుగా మారిపోయి లాగుతున్నట్టుగా అనిపించింది.

తిట్టుకుంటూ మనోరమ వెళ్ళిపోయింది. తర్వాత అంతా వెళ్ళారు.

తొందరగా ఇల్లు చేరాలని రమణమూర్తి బస్సు ఎక్కాడు. బస్టాపుదగ్గర. సిటీ బస్సులోంచి దిగి జేబులో చెయ్యిపెట్టి ఉలిక్కిపడ్డాడు. ఆయన జేబులో ఆ పర్సులేదు. బస్సులో ఎవడో కొట్టేసి వుంటాడు. ఏడుపు వచ్చింది. గుండె జారిపోయినట్లనిపించింది. ఎన్నో ఏళ్ళ నీతినీ, నిజాయితీని మంటకలిపి చేసిన నీచమైన పని ఫలితం తనకు దక్కకుండానే పోయింది.

నీరసంగా ఇంటికి వెళ్ళేసరికి పెద్ద కూతురు జానకి ఊర్నించి వచ్చివుంది. తండ్రిని పలకరించింది.

"ఏమిటి అలా వున్నారు? ఒంట్లో బావుండలేదా" అన్నది భార్య.

కూతురితో రెండు క్షణాలు మాట్లాడి భార్యను పక్కకు పిలిచి జరిగినదంతా చెప్పేశాడు రమణమూర్తి.

"అయ్యో...ఎంత ఘోరమైన పని చేశారండి? మచ్చలేని మీ జీవితానికి మచ్చ తెచ్చుకున్నారా ఈ వయసులో? ఎందుకిట్లా చేసారు? నేనే భరించలేకుండా వున్నాను ఈ విషయాన్ని" అన్నది ఏడుపు గొంతుతో.

"ఏం జరిగింది?" జానకి అడిగింది తల్లిని. దుర్గాంబ కూతురికి రమణమూర్తి చేసిన దొంగతనం గురించి చెప్పింది.

"ఎంతపని చేశావ్ నాన్నా. మాకు ఒక్క ఉత్తరం రాస్తే ఎలాగో ఆ డబ్బు పంపించేవాళ్ళం కదా. భర్తకి పుట్టినరోజు కానుక కొనడానికి ఆమె తెచ్చుకున్న డబ్బును నువ్వు తీసావా? అవి కూడా దక్కలేదుకదా. ఆమె ఎంత బాధ పడుతుంది? ఆ పాపం మనకొద్దు ఆ వేళంలో నువ్వు తొందరపడ్డావు. కానీ తర్వాత నువ్వెంత కుమిలిపోతావో మాకు తెలుసు నాన్నా. ఇలా చేసినందుకు నువ్వు పడే క్షోభ మేమర్థం చేసుకోగలం. మనవల్ల ఆమె బాధపడకూడదు. ఆమె వుసురు మనకొద్దు. ఇదిగో నాన్నా ఈ గొలుసు తీసుకెళ్ళి ఎక్కడైనా తాకట్టుపెట్టి ఆమె డబ్బులు ఆమెకు ఇచ్చెయ్యి" అంటూ తన

ఆరేళ్ళ కూతురి మెళ్ళో ఉన్న బంగారు గొలుసు తీసి తండ్రికి ఇచ్చింది జానకి.

"వద్దమ్మా పసిదాని గొలుసు వద్దు" అన్నాడాయన.

"అమ్మాయి చెప్పినట్లు చెయ్యండి. తొందరపాటులో చేసిన తప్పును ఒప్పుకోవడంలో తప్పులేదు మీరలా చేస్తే మాకందరికీ తృప్తిగా ఉంటుంది. లేకపోతే ఈ రాత్రికి ఇంట్లో ఎవ్వరూ భోజనాలు కూడా చెయ్యం" అన్నది దుర్గాంబ.

రమణమూర్తికి కూడా అలా చెయ్యాలనే ఉంది. తొందరపాటుతో దొంగతనం చేశాడు కాని అంతరాత్మ చిత్రవధను భరించలేకుండా ఉన్నాడు.

గొలుసు తీసుకుని మార్వాడీ షాపుకు వెళ్ళాడు. నాలుగు వందల అరవై రూపాయలకు మించి రాదని అంతే డబ్బు ఇచ్చాడు షాపువాడు.

ఆ డబ్బు తీసుకుని మనోరమ ఇంటికి వెళ్ళాడు. వరండాలో కూర్చుని భర్తతో మాట్లాడుతోంది ఆమె. రమణమూర్తిని చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిటిలా వచ్చారు?" అన్నది.

"నన్ను క్షమించు మనోరమా! ఘోరమైన, చెప్పుకోవడాన్కి సిగ్గుపడే తప్పు చేశాను. నీ పర్సును నేనే తీసాను" అని జరిగిన విషయాన్ని ఆమెతో చెప్పి జేబులోనించి నాలుగు వందల రూపాయిలను తీసి ఆమెకిచ్చాడు.

ఆమె ఆశ్చర్యంగా అయన్ని చూస్తూ "మీరే ఆ పర్సును తీశారంటే నేను ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నాను. డబ్బులవసరం అలాంటిది పోన్లెండి జరిగిందేదో జరిగింది ఈ విషయాన్ని ఎవ్వరికీ తెలియనివ్వను. నేనేదీ మనసులో పెట్టుకోను. నేనేమీ అనుకోన్లెండి" అన్నది ఆ డబ్బును తీసుకుని.

ఇంకోసారి ఆమెకు క్షమాపణలు చెప్పి వెనక్కు తిరిగాడు రమణమూర్తి.

"ఏమిటిదంతా? ఉదయం ఇరవై రూపాయలు అడిగితే లేవన్నావు? నీ పర్సులోకి నాలుగు వందలు ఎలా వచ్చాయి? రేపు నా పుట్టిన రోజేమిటి?" అర్థం అవక అడిగాడు, ఆమె భర్త.

మనోరమ నవ్వి "అంతా ఒక కథ. అదృష్టం ఇలా కలసి రావాలి. ఉదయం నా పర్సు బావుందని చూడటానికి ఇవ్వమని అటెండరు అడిగాడు. అందులో వున్న రూపాయి పావలా వాడు చూస్తే బావుండదని అందులో నాలుగు వందలు వున్నాయని, రేపు మీ పుట్టిన రోజు కానుకగా వాచీ కొంటానికి తెచ్చాననీ అందరి ముందూ కోతలు కోశాను. నిజంగానే అందులో డబ్బులున్నాయని ఈ ముసలాయన కొట్టేశాడు. ఇంకా నయం ఆయన దాన్ని తెరిచి చూడలేదు. తర్వాత జరిగిన కథ మీరు విన్నారు కదా" అన్నది దూరంగా రోడ్డుమీద తలవంచుకొని వెళుతున్న రమణమూర్తిని చూస్తూ.

**